Andhra jyothy Dt 31/07/17.



మలక్‌పేట

# మెట్రో ఆర్వోబీ రికార్డు

**25 రోజుల్లో పూర్తయిన పనులు • ఇంజనీరింగ్ రికార్డుగా పేర్కొంటున్న అధికారులు**
**• మియాపూర్-ఎల్‌బీనగర్ కారిడార్‌లో ముందడుగు • మరో మూడు చోట్ల చురుగ్గా నిర్మాణ పనులు**

**• సకాలంలో పూర్తయితే 3 నెలల్లో మెట్రో పరుగులు**

హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో క్లిష్టమైన మలక్‌పేట మెట్రో ఆర్వోబీ నిర్మాణాన్ని 25 రోజుల వ్యవధిలోనే పూర్తి చేశామని, దేశ ఆర్వోబీల నిర్మాణంలో ఇది ఒక కొత్త రికార్డు అని హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మలక్‌పేట వద్ద ఎల్‌బీనగర్-మియాపూర్ మెట్రో కారిడార్-1లో నిర్మించిన మెట్రో ఆర్వోబీ వివరాలను వెల్లడించారు. నిర్మాణ రంగంలో అనుభవం ఉన్న నిపుణుల ఖచ్చితమైన ప్రణాళికలు, ఉన్నతస్థాయి రైల్వే వంతెన ఇంజనీరింగ్ చర్చల ఫలితంగానే 164 అడుగుల పొడవు ఉన్న మెట్రో ఆర్వోబీని 25 రోజుల్లోనే పూర్తి చేశారన్నారు. ఒక పక్క బహిరంగ మురికినీటి కాలువ, ఇంకో పక్క మలక్‌పేట రైల్వే స్టేషన్, దిగువన నిరంతరం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఇరుకైన రహదారి కావడంతో ఇంజనీరింగ్ పరంగా ప్రమాదకరమైన ప్రాంతం. అలాంటి ప్రాంతంలో తగిన జాగ్రతలు తీసుకొని మెట్రో ఆర్వోబీ నిర్మాణం పనులను చేపట్టామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

### మూడు భాగాలుగా మలక్‌పేట మెట్రో ఆర్వోబీ..

మలక్‌పేట రైల్వే లైనుపై నిర్మిస్తున్న మెట్రో ఆర్వోబీని మూడు భాగాలుగా డిజైన్ చేశారు. మొత్తం 394 అడుగుల పొడవు ఉండే ఈ బ్రిడ్జిలో ప్రధాన భాగాన్ని 164 అడుగులు, ఇరువైపులా దిల్‌సుఖ్‌నగర్ వైపు 98 అడుగు, చాదర్‌ఘాట్ వైపు 131 అడుగులుగా విభజించారు. ఉప్పల్ కాస్టింగ్ యార్డులో వంతెనను తయారు చేసి, పరీక్షించిన తర్వాత మలక్‌పేటకు తరలించారు. ఇంతకు ముందు బేగంపేట రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన బ్రిడ్జ్ బిల్డర్ పద్ధతిలోనే ఇక్కడా ఉపయోగించి మెట్రో ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇందులో సుమారు రెండు 100 టన్నుల బరువుల గల భారీ క్రేన్లని ముందుగా నిర్మించబడిన వయాడక్ట్‌కి ఇరువైపులా బిగించి వయాడక్ట్‌లను ఒక్కొక్కటిగా బిగించారు. ప్రధాన భాగంలో 12 ప్రీకాస్ట్ సెగ్మెంట్లను ఉపయోగించారు. ప్రతీ సెగ్మెంట్‌ను భారీ క్రేన్లతో ఎత్తి ముందుగా నిర్మించిన డెక్ స్లాబ్ పైన ట్రాలీ పైకి ఎక్కించి 80 టన్నుల బరువు గల వించ్ సహాయంతో బ్రిడ్జి బిల్డర్‌లోకి చేర్చారు. ఆతర్వాత సెగ్మెంట్లను కావాల్సిన కోణానికి, స్థానానికి దింపి తాత్కాలిక పరికరాలు, ప్రత్యేకమైన రసాయనాలతో జోడించి, ప్రత్యేకంగా తయారుచేసిన ఉక్కు తీగలతో బిగించారు. ఈ పనులను నిర్వహించడానికి రైల్వేశాఖ ప్రత్యేకంగా అనుమతిచ్చిన 3 గంటల సమయంలోనే సెగ్మెంట్ల నిర్మాణం పూర్తి చేశారు. రైలు వంతెన నిర్మాణ నిపుణులు రావు, కొండలు పర్యవేక్షణలో ఇంజనీర్ల బృందం మెట్రో ఆర్వోబీ నిర్మాణ్ని చేపట్టారు.



మలక్‌పేట రైల్వే లైనుపై నిర్మించిన మెట్రో ఆర్వోబీ

**మెట్రో ఆర్వోబీ వివరాలు.. అడుగుల్లో..**

| | |
|---|---|
| పొడవు | 394 |
| ఎత్తు | 58 |
| రైలు పట్టాల పైన పొడవు | 164 |
| దిల్‌సుఖ్‌నగర్ వైపు | 98 |
| చాదర్‌ఘాట్ వైపు | 131 |
| సెగ్మెంట్ బరువు | 45 |
| బ్రిడ్జి బిల్డర్ పొడవు | 45 |
| బ్రిడ్జి బిల్డర్ వెడల్పు | 17 |

### మియాపూర్-ఎల్‌బీనగర్‌లో ముందడుగు

మెట్రోరైలు ప్రాజెక్టులో మియాపూర్-ఎల్‌బీనగర్ మార్గాన్ని కారిడార్-1గా గుర్తించారు. 29 కి.మీ పొడవు ఉండే ఈ మార్గంలో ఇప్పటికే మియాపూర్ నుంచి ఎస్సార్‌నగర్ వరకు 10 కి.మీ మే మెట్రో కారిడార్ నిర్మాణం పూర్తయి ట్రయల్ రన్స్ జరుగుతున్నాయి. అదేవిధగా మలక్‌పేట నుంచిఎల్‌బీనగర్ వరకు సైతం గతంలోనే పూర్తయినా ఈ మధ్యలో ఉన్న మార్గం పూర్తి చేయడంలోనే తీవ్ర జాప్యం జరిగింది. ఈ కారిడార్‌లో మలక్‌పేట, లక్డీకాపూల్ వద్ద రెండు రైల్వే లైన్లపై మెట్రో ఆర్వోబీలను నిర్మించాల్సి ఉండగా, తాజాగా మలక్‌పేట మెట్రో ఆర్వోబీ పూర్తయింది. ఇక లక్డీకాపూర్ వద్ద మెట్రో ఆర్వోబీ నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వీటితో పాటు నాంపల్లి వద్ద ఆస్తులసేకరణలో జాప్యం మూలంగా పనులు కొంతకాలం ఆగిపోయి మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక చివరగా అమీర్‌పేట చౌరస్తా నుంచి మెట్రోవనం వరకు నిర్మిస్తున్న ఇంటర్ చేంజ్ నిర్మాణం పనులు పూర్తయితే ఎల్‌బీనగర్-మియాపూర్ కారిడార్-1 మొత్తం పూర్తయినట్లవుతుంది. ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఒక మార్గం నిర్మాణం పూర్తయి మెట్రో రైళ్లు పరుగులు పెట్టేందుకు అవకాశం రానుండడంతో వెంటనే మెట్రోను ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం మూడు చోట్ల నాంపల్లి, లక్డీకాపూల్, అమీర్‌పేట వద్ద పనులు మూడు నెలల్లో పూర్తయితే దసరా నాటికి మియాపూర్-ఎల్‌బీనగర్ మార్గంలో మెట్రో రైళ్లను నడిపేందుకు గ్రీన్ సిగ్నల్ వస్తుంది.